

పటేల్ స్టేడియం కళకళ
జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు పెద్దసంఖ్యలో ఔత్సాహికులు హాజరవుతున్నారు.
IIలో



అకాల వర్షంతో ఆందోళన
జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవగా రైతులు ఆందోళన చెందారు.
IIలో

గరిష్ఠం / కనిష్ఠం
38° / 26°

వాతావరణం
జిల్లాలోని శనివారం ఉదయం, సాయంత్రం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. మధ్యాహ్నం మాత్రం ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సదస్సు
ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల నెలవారీ సదస్సు శనివారం ఏర్పాటుచేసినట్లు ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఖమ్మంలోని ఎస్‌ఈ కార్యాలయంలో ఉదయం 11గంటలకు సదస్సు మొదలవుతుందని, హెచ్‌టీ వినియోగదారులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. ఈ సదస్సులో విద్యుత్ అకౌంట్స్, ఇంజనీరింగ్ తదితర విభాగాల ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు.

ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్‌ఈ, డీఈలు

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని మూడు ఎత్తిపోతల పథకాల మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. జలవనరుల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి సమర్పించిన మూడు పనులకు నిధుల మంజూరు అనుమతి ఇచ్చారు. భక్తరామదాసు ప్రాజెక్టుకు విద్యుత్ యంత్రాల మరమ్మతులకు రూ.10 లక్షలు, ముతాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మరమ్మతులకు రూ.25.50 లక్షలు, మోటాపురం లిఫ్ట్ బోర్ మరమ్మతుకు రూ.7.70 లక్షలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. వీసీలో జిల్లా నుంచి ఎస్‌ఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, డీఈలు మన్మధరావు, అయోష, శోభారాణి, పృథ్వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఏఎస్‌కు స్కూళ్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహించే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్(బీఏఎస్) పథకానికి ప్రైవేట్ పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో కొత్త పాఠశాలలు ఎంపిక చేయనుండగా.. స్టేట్, సెంట్రల్ బోర్డు ద్వారా గుర్తింపు కలిగిన స్కూళ్ల బాధ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. గత ఐదేళ్లలో ఏడు నుంచి 10వ తరగతిలో 90శాతం కంటే ఎక్కువ ఫలితాలు, 50 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు మొదటి తరగతి ఉత్తీర్ణత సాధించడమే కాక విశాలమైన తరగతి గదులు, వసతి, క్రీడా మైదానం, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ ఉండాలని తెలిపారు. ఈమేరకు ఆసక్తి కలిగిన పాఠశాలల యాజమాన్యాలు పూర్తి వివరాలతో ఈనెల 25వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని డీడీ సూచించారు.

గిరిజన గురుకుల కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ
భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయని పీఓ బి.రాహుల్ తెలిపారు. గురుకులాల్లో బాలికలకు 737 సీట్లు ఉండగా, భద్రాచలంలోని గురుకుల కాలేజీలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినుల్లో 737 మందికి మెరిట్ ఆధారంగా వారు కోరుకున్న కాలేజీల్లో సీట్లు కేటాయించామని పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓలు అరుణకుమారి, పద్మావతి, ప్రిన్సిపాళ్లు చైతన్య, నాగేంద్రమ్మ, రాణి, ఓ.మాధవి, సంధ్యారాణి, మాధవీలత, ఓ.పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను తీర్చిదిద్దాలి



సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల: వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న శిబిరాల ద్వారా విద్యార్థినులను ఎంచుకున్న రంగాల్లో తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కొణిజర్ల సమీపాన కేజీబీవీలోని సమ్మర్ క్యాంపును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ బోధన, ఇతర అంశాలపై ఆరా తీశాక విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడేలా శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. జీసీడీఓ తులసి, ఎంఈఓ అబ్రహం, ఎంపీడీఓ రోజా, ఎంపీఓ రాజేశ్వరి, క్యాంపు కోఆర్డినేటర్ లావణ్య, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



మీటర్లు గిరగిరా...

- ఉష్ణోగ్రతలతో పాటే పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- జిల్లాలో డిస్కం కోటాకు మించి వాడకం
- వ్యవసాయ ఉపయోగం లేకున్నా గృహాల్లో పైపైకి...

ఖమ్మంవ్యవసాయం: ఎండలు మండుతున్న వేళ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలో డిస్కం కేటాయింపునకు మించి విద్యుత్ వినియోగం జరుగుతుండడం గమనార్హం. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ వినియోగం లేకున్నా, గృహ వినియోగం నానాటికీ పెరుగుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. సర్కిళ్ల పరిధిలో సర్వీసులు, వాటి సామర్థ్యం, సీజన్ల వారీగా వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని డిస్కం నుంచి కోటా కేటాయిస్తారు. ఈ ఏడాది మార్చి నుంచి ఎండ తీవ్రత మొదలుకాగా, ఏప్రిల్ చివరి వారానికి తీవ్రరూపం దాల్చింది. గతనెల 26న జిల్లాలో గరిష్ఠంగా 43.1 డిగ్రీలు, ఈనెల 13న 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. మిగతా రోజుల్లోనూ 40–45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో ఆ ప్రభావం విద్యుత్ వినియోగంపై పడుతోంది.

తగ్గిన కోటా.. పెరిగిన వినియోగం

ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో వివిధ కేటగిరీల కింద మొత్తం 6,96,179 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో గృహ సర్వీసులు 4,96,114 కాగా, వ్యవసాయ సర్వీసులు 1,19,345.. మిగిలినవి ఇతర కేటగిరీల్లో ఉన్నాయి. మార్చి ఏప్రిల్ వరకు గృహ, పరిశ్రమల వినియోగంతో పాటు యాసంగి పంటల సాగులో భాగంగా మోటార్లు వినియోగించారు. దీంతో సర్కిల్‌కు నిత్యం 5.97 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశారు. మే ఆరంభం నాటికి యాసంగి పంటల కోతలు పూర్తవడంతో విద్యుత్ కోటాను 4.93 మిలియన్ యూనిట్లను తగ్గించారు. అంటే మార్చి, ఏప్రిల్ నెలలతో పోలిస్తే మే నెల కోటా 1.04 మినియన్ యూనిట్లు తగ్గింది. వ్యవసాయ వినియోగం లేదని ఈ నిర్ణయం తీసుకోగా.. ఎండల కారణంగా గృహ వినియోగం పెరగడంతో పలుచోట్ల అంతరాయాలు, లోఓల్టేజీ సమస్యలు ఎదురవుతున్నాయి.

వినియోగానికి అనుగుణంగా సరఫరా



ఉష్ణోగ్రతల కారణంగా కొద్ది రోజులుగా విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో కోటాతో ప్రమేయం లేకుండా జిల్లాకు అవసమైన సరఫరా ఇస్తున్నారు. జిల్లాలో ఎక్కడా సమస్య ఎదురు కాకుండా వినియోగదారుల అవసరాల మేరకు సరఫరా జరిగేలా పర్యవేక్షిస్తున్నాం.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్‌ఈ

ఉపశమనం కోసం..

ఎండ తాపం నుంచి ఉపశమనం కోసం దాదాపు అందరూ ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు ఉపయోగిస్తున్నారు. పగలు, రాత్రీ లేకుండా కూలర్లు, ఏసీలు నడుస్తుండడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈనెలలో ఉష్ణోగ్రతలు పెరగగా... విద్యుత్ వినియోగం కోటాకు మించి నమోదవుతోంది. ఖమ్మం సర్కిల్‌కు నిత్యం 4.93 మిలియన్ల యూనిట్ల విద్యుత్ కోటా కేటాయిస్తే.. గరిష్ఠంగా 5.82 యూనిట్ల మేర వినియోగం జరుగుతుండడం గమనార్హం. ఈ లెక్కన సర్కిల్‌లో కోటాకు మించి అదనంగా 18 శాతం విద్యుత్ వినియోగం జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు.

జిల్లాకు నిత్యం 4.93 మిలియన్ యూనిట్లు కోటా కేటాయించగా కొద్దిరోజులుగా వినియోగం

తేదీ	10	11	12	13	14	15
వినియోగం (మి.యూనిట్లలో)	5.04	5.04	5.42	5.64	5.82	5.52

ఇప్పుడు ప్రారంభిస్తేనే మేలు



కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు


కాళేశ్వరంలో వైభవంగా సరస్వతి పుష్కరాలు

- 2027 జూలైలో గోదావరికి పుష్కరాలు
- రాష్ట్ర విభజనతో భద్రగిరిలో మారిన పరిస్థితులు
- కార్యాచరణ సిద్ధం చేయాలని కోరుతున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి తీరం వెంబడి కాళేశ్వరంలో కనుల పండువగా సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయి. అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి పుష్కరాల కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. వీటితో కాళేశ్వరంలో కొత్తగా సరస్వతి మాత విగ్రహం, స్నానఘట్టాలు, నదీ తీరం వెంబడి కొత్త రోడ్లు, టెంట్ సిటీలు వెలిశాయి. ఇదే తరహాలో గోదావరి పుష్కరాలకు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో నెలకొన్న స్థల సమస్య, రోజురోజుకూ పెరుగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని గోదావరి పుష్కరాలకు యాక్షన్ ప్లాన్ ముందుగానే సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు. లేదంటే 2015 పరిస్థితే పునరావృతం అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

వన్నె తెచ్చిన పుష్కరాల పనులు

ఈ శతాబ్దంలో 2003, 2015లలో గోదావరికి పుష్కరాలు వచ్చాయి. ముఖ్యంగా 2003 పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన కరకట్ట, స్నానఘట్టాలు భద్రాచలం రూపురేఖలను మార్చాయి. కరకట్ట నిర్మాణంతో భద్రాచలం పట్టణానికి గతంలో పోల్చితే వరదల నుంచి భద్రత కలిగింది. విశాలమైన స్నానఘట్టాలు వచ్చాయి. మహిళలు బట్టలు మార్చుకునే గదులు, కల్యాణకట్టలు అందుబాటులోకి వచ్చాయి. గోదావరి మాతకు విగ్రహం, రామాయణ ఇతివృత్తం తెలిపేలా శిల్పాలను ఏర్పాటు చేశారు. దీంతో భద్రాచలానికి కొత్త శోభ వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత 2015లో జరిగిన పుష్కరాలకు చెప్పుకోతగ్గ పనులేవీ భద్రాచలంలో జరగలేదు. గతంలో ఉన్న వాటినే మరికొంత మెరుగు పరిచారు. కొత్త రాష్ట్రంగా ఏర్పాటుకావడం, ఇక్కడ స్థల సమస్యలు వంటి అంశాలు అప్పుడు పుష్కర పనులకు అడ్డం పడ్డాయి.



కీలక అంశాలు

రాష్ట్ర విభజన కారణంగా భద్రాచలం క్షేత్రంలో స్థల సమస్య ఏర్పడింది. దీంతోపాటు ఏటా జూలైలో వచ్చే వరదలను దృష్టిలో ఉంచుకుని నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా టెంట్ సిటీ, స్మార్ట్ సిటీలను ఎక్కడ నిర్మించాలనే అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ప్రస్తుతం భద్రాచలంలో సామాన్య భక్తుల పుష్కర ఘాట్, బూర్గంపాడు మండలం మోతె దగ్గర వీఐపీ ఘాట్‌లు ఉన్నాయి. రాబోయే రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్య రాకుండా కొత్త ఘాట్లను నిర్మించాలి. వాహనాల పార్కింగ్, రాకపోకలపైనా అధ్యయనం చేయాల్సి ఉంది. వీటితో పాటు ఏడాది పొడవునా భద్రాచలం వచ్చే భక్తులకు ఉపయోగపడేలా డార్మిటరీలు, లాకర్లు, సామూహిక స్నానాల గదులు, టాయిలెట్ల నిర్మాణాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. నదీ తీరంలో సాంస్కృతి కార్యక్రమాలు జరిగేలా అంఫీ థియేటర్, కరకట్ట పైకి సులువుగా ఎక్కి దిగేలా లిఫ్టులు, అదనపు ర్యాంపులు, ఐకానిక్ వంతెన తదితర నిర్మాణాలు వంటివి రాబోయే పుష్కర పనుల్లో కీలకంగా మారనున్నాయి.

భద్రాచలమే కీలకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పటి నుంచి గోదావరి పుష్కరాలంటే ఆంధ్రకు రాజమండ్రి, తెలంగాణకు భద్రాచలం కేంద్ర స్థానంగా ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత భారీ స్థాయిలో ఏర్పాట్లు చేయకున్నా భద్రాచలం ప్రధాన కేంద్రంగానే ఉంది. కొత్తగా ధర్మపురి, కోటిలింగాల, కాళేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలు గోదావరి పుష్కరాల్లో ప్రముఖంగా నిలిచాయి. తిరిగి గోదావరికి 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3వరకు పుష్కరాలు జరగనున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకోవడమే కాక దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు, భద్రాచలం పట్టణం, ఏడాది పొడవునా ఇక్కడ జరిగే కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని యాక్షన్ ప్లాన్ రెడీ చేయాల్సిన అవసరముంది. లేకపోతే 2015 తరహాలోనే పైపై పనులు చేపడితే మరోసారి భద్రాద్రి నష్టపోక తప్పదు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- వచ్చే ఏడాది 150 సీట్లకు ప్రతిపాదన
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు



డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం: ఈ ఏడాది కూడా నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన సాగుతోందని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. కాలేజీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది మొదటి బ్యాచ్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. రెండో ఏడాది కూడా అదే ఫలితం వచ్చేలా బోధిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కళాశాలలో 100ఎంబీబీఎస్ సీట్లు ఉండగా వచ్చే ఏడాది 150కు పెంచేలా ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు అధ్యాపకులు, సిబ్బంది ఉన్నందున, మూడో ఏడాది బోధనకు అనుమతులు సులువుగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థులకు మెరుగైన వసతి

రఘునాథపాలెం వద్ద మెడికల్ కళాశాల భవనాలు నిర్మిస్తుండగా, అవి పూర్తయ్యే వరకు ప్రస్తుత కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతి కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయ భవనంలో ఎంబీబీఎస్ మొదటి, రెండో ఏడాది బాలురకు వసతి ఏర్పాటుచేయగా, మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకూ సరిపోతాయని చెప్పారు. పాత ఆర్అండ్‌బీ కార్యాలయంలో బాలికలకు వసతి కల్పించామని తెలిపారు. కాగా, మిగతా కళాశాలలతో పోలిస్తే ఖమ్మం కాలేజీలో 14 మృతదేహాలు ఉన్నందున, విద్యార్థులకు ప్రాక్టికల్ బోధనలో ఇక్కట్లు లేవని ప్రిన్సిపాల్ వివరించారు. ఎంబీబీఎస్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు జూలై, ఆగస్టు నెలల్లో వార్షిక పరీక్షలు ఉంటాయని, సెప్టెంబర్‌లో కొత్త అడ్మిషన్లు మొదలవుతాయని ఆయన వెల్లడించారు.

ఎన్నెస్పీ మిగులు భూములపై ఆరా
ఖమ్మంఅర్బన్: ఖమ్మం చుట్టుపక్కల ఉన్న సాగర్(ఎన్నెస్పీ) మిగులు భూముల గుర్తింపుపై అధికారులు దృష్టి సారించారు. మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండగా, భూనిర్వాసితులకు నివాస ప్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ఎన్నెస్పీ మిగులు భూముల వివరాలను సర్వే నంబర్ల వారీగా ఆరా తీస్తున్నారు. ఖమ్మం పరిధిలోని దానవాయిగూడెంలో సాగర్ కాల్వల తవ్వకం సమయాన 320 ఎకరాలు సేకరించగా, ఇందులో కాలనీ, డంపింగ్ యార్డుకు పోగా ఇంకా 70 ఎకరాలు ఉంటుందని భావిస్తున్నారు. ఇందులో భాగంగా భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రమేష్ నేతృత్వాన తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ వాహీద్, రెవెన్యూ సిబ్బంది, జలవనరుల శాఖ డీఈ ఉదయ్‌ప్రతాప్ తదితరులు రికార్డుల ఆధారంగా దానవాయిగూడెంలో పరిశీలించారు. త్వరలోనే భూమి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

అంబేద్కర్ ఆశయసాధనే లక్ష్యం

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ కోదండరామ్




విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కోదండరామ్ తదితరులు

తిరుమలాయపాలెం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సూచించారు. మండలంలోని హస్నాబాద్‌లో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంతోనే అందరికీ విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు దక్కుతున్నాయని తెలిపారు. అనేక ఆటుపోట్లను తట్టుకుని ప్రపంచ మేధావిగా ఎదిగిన ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ మాగి వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ కాశీం, రిటైర్డ్ ప్రొఫెసర్ ముత్తయ్య, పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యతో పాటు వెన్నెబోయిన రమేష్, కీసర సంకీర్త్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, చింతరాల నాగభూషణం, సుదర్శన్, మాగి వెంకన్న, యాతాకుల నగేష్, మాగి లక్ష్మయ్య, మాగి బాలకృష్ణ, సత్తిరెడ్డి, శ్రీనివాస్, పల్లి నాగయ్య, మాగి ఉపేందర్, మాగి రాకేష్, సంతోష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో కదలిక..

- తుది ముసాయిదాపై కసరత్తు
- ఈనెలాఖరుకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించేలా వేగం
- పాత సుడా పరిధిలోనే ప్లాన్ రూపకల్పన



సుడా పరిధి తెలియచేసే మ్యాప్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను కలుపుకుని రూపొందించే 'సుడా' మాస్టర్ ప్లాన్‌లో కదలిక వస్తోంది. ఐదేళ్లుగా యంత్రాంగం తర్జనభర్జన పడుతుండగా, రకరకాల కారణాలతో మాస్టర్ ప్లాన్ ముసాయిదా పబ్లికేషన్ వాయిదా పడుతోంది. దీంతో అటు సుడా పరిధి, ఇటు కేఎంసీలో అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యాన మాస్టర్ ప్లాన్‌ను త్వరగా సిద్ధం చేసి ఆమోదంలోకి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించగా సుడా, కేఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పాత 'సుడా' పరిధిలో..

రాష్ట్ర ప్రభుత్వం సుడా పరిధిని విస్తరిస్తూ గతేడాది నవంబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మాస్టర్ ప్లాన్ కూడా మళ్లీ మొదటి నుంచి తయారు చేస్తారని అంతా భావించారు. కానీ ప్రభుత్వం మాత్రం పాత స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) పరిధిలోనే మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని సూచించింది. ఈమేరకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మండలాలకు చెందిన 46 గ్రామపంచాయతీల పరిధిలో ప్లాన్ రూపకల్పనపై దృష్టి సారించారు. అయితే, మాస్టర్ ప్లాన్‌లో కొన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని, నిర్మాణాలకు అడ్డంకిగా ఉన్న ఆంక్షలు తొలగించే అవకాశముందన్న చర్చ జరుగుతోంది.

సమావేశాలు ముగిసినా..

సుడా మాస్టర్ ప్లాన్‌పై రెండేళ్లుగా కసరత్తు చేస్తున్నారు. తొలుత 2021లోనే మాస్టర్ ప్లాన్ అమలుచేయాలని నిర్ణయించినా సాధ్యం కాలేదు. ఆతర్వాత ఓ ప్రైవేట్ సంస్థతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయించి 2022 ఫిబ్రవరి 11న తొలి స్టేక్ హోల్డర్ల సమావేశం నిర్వహించారు. అందులో వచ్చిన సూచనల ఆధారంగా మార్పులు చేసి అదే ఏడాది జూలై 1న రెండో సమావేశం నిర్వహించి మళ్లీ సలహాలు స్వీకరించారు. అనంతరం వాటిని కూడా ప్లాన్‌లో పొందుపరిచారు. అయితే, 2022 అక్టోబర్ – నవంబర్‌లో ముసాయిదా ప్లాన్ పబ్లిష్ చేయాల్సి ఉన్నా సవరణల కోసం అధికారులు వాయిదా వేస్తూ వచ్చారు.

బఫర్ జోన్‌లో మార్పులు

గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో మున్నేరు పరీవాహక ప్రాంతాలు నీటమునిగాయి. దీంతో మున్నేరు బఫర్ జోన్ పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తద్వారా మాస్టర్‌ప్లాన్‌లో స్వల్ప సవరణలు చేసేలా ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అలాగే, స్టేక్ హోల్డర్ల నుండి కొన్ని ప్రాతిపాదనలు రాగా అవి కూడా పొందుపర్చే అవకాశముంది. మున్నేరు, చెరువులు, నాలాలు, కాల్వల బఫర్ జోన్లకు సంబంధించి కొద్ది మార్పులు జరగనుండగా.. ఈనెలాఖరులోగా ముసాయిదాను విడుదల చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నట్లు తెలిసింది.

ప్లాన్ ఉంటేనే అభివృద్ధి..

రాష్ట్రంలో ప్రధాన నగరంగా ఖమ్మం విస్తరిస్తుండడమే కాక అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. ఈ నేపథ్యాన మాస్టర్ ప్లాన్ ఉంటే పద్ధతి ప్రకారం అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుంది. అలా లేకపోవంతో నిర్మాణాలు అడ్డగోలుగా జరుగుతుండగా.. రోడ్లు వెడల్పుగా లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యాన మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తేనే నగర అభివృద్ధి ప్రణాళికాయుతంగా జరుగుతుందని.. తద్వారా భవిష్యత్‌లో సమస్యలు ఉండవని భావిస్తున్నారు.

త్వరలోనే తుదిరూపం



సుడా మాస్టర్ ప్లాన్ తుది ముసాయిదాను ఏజెన్సీ నిర్వాహకులు వారం రోజుల్లో సిద్ధం చేయనున్నారు. ఈ ముసాయిదాను పబ్లిష్ చేశాక ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపిస్తాం. కేఎంసీతో పాటు పాత సుడా పరిధిని పరిగణనలోకి తీసుకుని ఈ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్, సుడా వైస్ చైర్మన్

పశువుల అక్రమ రవాణా జరగకుండా కట్టడి
- జిల్లా సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు



చెక్‌పోస్ట్ వద్ద సూచనలు చేస్తున్న అదనపు డీసీపీ ప్రసాదరావు

ఖమ్మంక్రైం: పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గాను పోలీసులు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం జిల్లాలోని అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా పశువుల రవాణా విషయమై వివాదాలు తలెత్తకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. సరైన వాహనాలు లేకుండా, చట్టవిరుద్ధంగా ఆవులు, దూడలను రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, పండుగల వేళ మత సామరస్యానికి భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారిని గుర్తించేందుకు ప్రత్యేక సెల్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. కాగా, వైరా(పాలడుగు), బస్వాపురం క్రాస్(కొణిజర్ల), హనుమాన్ తండా(కల్లూరు), వెంకటగిరి క్రాస్(ఖమ్మం రూరల్), సుబ్లేడ్ క్రాస్(తిరుమలాయపాలెం), సింగరేణి టోల్‌ప్లాజా(కూసుమంచి), వల్లభి(ముదిగొండ)ల్లో చెక్ పోస్టులు ఏర్పాటుచేయగా నిరంతరం గస్తీ కాయాలని సీపీ సూచించారు.

క్లుప్తంగా

ఈనెల 21నుంచి ఎన్‌సీసీ క్యాంప్



పాఠశాల ఆవరణలో పరిశీలిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

వైరా: వైరా శాంతినగర్‌లోని న్యూ లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో ఎన్‌సీసీ 11(టీ)వ బెటాలియన్ ఆధ్వర్యాన కంబైన్డ్ యాన్యువల్ ట్రెనింగ్ క్యాంపు నిర్వహించనున్నారు. ఈనెల 21 నుంచి 30 వ తేదీ వరకు క్యాంపు జరగనుండగా, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కే.భద్ర, ఏఓ కల్నల్ నవీన్ యాదవ్ శుక్రవారం పాఠశాల ఆవరణలో పరిశీలించారు. క్యాంప్‌నకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ జిల్లాల నుంచి 700మంది కేడెట్లు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం ద్వారా ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.

కాంటా వేయడం లేదని రైతుల ధర్నా



తహసీల్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

నేలకొండపల్లి: రోజులు గడుస్తున్నా ధాన్యం కాంటా వేయకపోవడంతో ఎన్నాళ్లు పడిగాపులు కాయాలంటూ రైతులు ధర్నాకు దిగారు. నేలకొండపల్లి మండలం అనాసాగారంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి నెల క్రితం రైతులు దాదాపు 10 వేల బస్తాల ధాన్యం తీసుకొచ్చారు. ఈ ధాన్యానికి ఇప్పటి వరకు కాంటా వేయకపోవడంతో తహసీల్ వరకు ర్యాలీగా చేరుకుని ధర్నా చేశారు. దీంతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు వెంటనే కాంటాలు వేయిస్తామని హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళన విరమించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



ర్యాలీలో డీఎంహెచ్ఓ, ఉద్యోగులు

బోనకల్: ప్రైవేట్‌తో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు ఉన్నందున మెరుగైన చికిత్స అందుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కళావతిబాయి వెల్లడించారు. బోనకల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యసేవలు, మందుల నిల్వలపై ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, పంచాయతీరాజ్ ఉద్యోగుల సమన్వయంతో డ్రై డే – ఫ్రై డే నిర్వహిస్తూ దోమలను అరికట్టాలని తెలిపారు. అనంతరం జాతీయ డెంగీ నివారణ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో డీఎంహెచ్ఓ పాల్గొన్నారు. వైద్యాధికారి స్రవంతి, ఉద్యోగులు దానయ్య, స్వర్ణ మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని రామానుజవరానికి చెందిన దర్శనాల వెంకటేశ్వర్లు(60) మూడు రోజులుగా మద్యం సేవిస్తూ తిరుగుతున్నాడు. మిట్టపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఓ షాపులో మద్యం తాగి నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన అల్లుడు బీరెల్లి రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

వేంసూరు: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లింగపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాంపల్లి ఈశ్వరాచారి(42) ఇంటి ముందు ఉన్న కార్పెంటర్ షెడ్‌లో పడి ఉన్న విద్యుత్ వైర్‌ను సరిచేస్తున్నాడు. ఈక్రమంలో షాక్‌కు గురి కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈశ్వరాచారి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

వడదెబ్బతో బాలిక..

రఘునాథపాలెం: వడదెబ్బ బారిన పడిన విద్యార్థిని మృతి చెందింది. రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన గ్రామీణ వైద్యుడు కస్తాల రాంబాబు – రాణి దంపతుల చిన్న కుమార్తె శరణ్య(14) ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. వేసవి సెలవుల నేపథ్యాన కొత్తగూడెంలోని బంధువుల ఇంటికి వెళ్లగా శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంటర్‌లో చేర్పేందుకు సిద్ధమవుతుండగా వడదెబ్బతో కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

పటేల్ స్టేడియం కళకళ

- కొనసాగుతున్న వేసవి క్రీడా శిబిరాలు
- ఈత, ఇతర క్రీడల్లో శిక్షణకు ఔత్సాహికుల బారులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియం ఉదయం, సాయంత్రం ఔత్సాహిక క్రీడాకారులతో కళకళలాడుతోంది. స్విమ్మింగ్ సహా పలు క్రీడల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండగా పిల్లలు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. దీంతో శిక్షణ సమయాల్లో మార్పులు చేసి బ్యాచ్‌ల వారీగా విభజించారు. గతంతో పోలిస్తే ఎక్కువగా క్రీడాకారులు వస్తుండడంతో కోచ్‌లు కూడా ఉత్సాహంగా తర్ఫీదు ఇస్తున్నారు. స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, స్కేటింగ్, బ్యాడ్మింటన్ అంశాల్లో ఎక్కువ మంది హాజరవుతున్నారు. ఇందులో స్విమ్మింగ్‌కైతే మరింత మంది వస్తుండడంతో బ్యాచ్‌లుగా విభజించినా అందరికీ శిక్షణ ఇవ్వడం సాధ్యం కావడం లేదని కోచ్‌లు చెబుతున్నారు. అయితే, వేసవి సెలవులకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా హాజరైతేనే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటడం వీలవుతుందని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.



స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న ఔత్సాహికులు



టేబుల్ టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తూ...

ఇబ్బంది లేకుండా శిక్షణ



స్టేడియంలో వేసవి శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. అన్ని క్రీడాంశాల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశాం. ఔత్సాహికులు ఎక్కువగా వస్తుండడంతో రద్దీ నెలకొంటోంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం.

– టి.సునీల్‌రెడ్డి, డీవైఎస్ఓ

సెలవుల తర్వాతా పంపించాలి



టేబుల్ టెన్నిస్‌లో శిక్షణకు పిల్లలను తల్లిదండ్రులు ఆసక్తిగా తీసుకొస్తున్నారు. అయితే, సెలవులకే పరిమితం చేయకుండా దీర్ఘకాలిక శిక్షణ ఇప్పిస్తే బాగుంటుంది. అప్పుడే పిల్లలు రాటుదేలి పోటీల్లో సత్తా చాటే అవకాశం ఏర్పడుతుంది.

– వీ.వీ.ఎస్.మూర్తి, టేబుల్ టెన్నిస్ కోచ్

నిత్యం ప్రాక్టీస్‌తోనే...



పిల్లలు ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఒకటి, రెండేళ్లలోనే జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఇది జరగాలంటే నిరంతరం ప్రాక్టీస్ చేయించాలి. సెలవులు తర్వాత కూడా శిక్షణ ఇప్పిస్తేనే సాధ్యమవుతుంది.

– కె.సురేష్, స్కేటింగ్ కోచ్

ప్రతిరోజూ ప్రాక్టీస్



కోచ్ సూచనలతో ప్రతిరోజు ప్రాక్టీస్‌కు వస్తున్నాను. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా శిక్షణ ఇస్తున్నారు. నేను కూడా అదే రీతిలో ప్రాక్టీస్ చేస్తున్నా. క్రమం తప్పకుండా ప్రతిరోజు వస్తుండడంతో ఫలితం కనిపిస్తోంది.

– హాలయా, స్కేటింగ్ క్రీడాకారిణి

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగేలా ఏర్పాట్లు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రైతులు పండించిన ధాన్యమంతా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని.. ఈక్రమంలో ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేసిన 48 గంటల్లోనే రైతులకు ఖాతాలో డబ్బు జమ చేస్తున్నామని తెలిపారు. కాగా, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్ కవర్లు సమకూర్చాలని సూచించారు. రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తుల విచారణ త్వరగా పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా నుంచి వీసీకి హాజరైన కలెక్టర్, ఆతర్వాత అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డీఎం శ్రీలత, వివిధ శాఖల అధికారులు గంగాధర్, సన్యాసయ్య, పుల్లయ్య, ఎం.ఏ.అలీమ్ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు కామన్ సర్వీస్ సెంటర్లు

తొలి విడతగా 70 మందికి శిక్షణ పూర్తి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ప్రాజెక్టులను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే డీఐసీఎస్‌సీ ప్రాజెక్టులో పైలట్‌గా దేశంలోని పది జిల్లాలను ఎంపిక చేయగా ఖమ్మంకు సైతం స్థానం దక్కింది. ఈమేరకు మోడల్ కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) నిర్వహణకు 153 మంది మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేసి, తొలి విడతగా 70 మందికి శిక్షణ ఇచ్చారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులు శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో ఆర్.సన్యాసయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్‌సీల ఏర్పాటుకోసం మహిళలకు రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలను మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో ప్రజలకు సాంకేతిక సర్వీసులు అందించేందుకు తీసుకొచ్చేలా మహిళలతో మోడల్ సీఎస్‌సీలు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఐసీఎస్‌సీ రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీహరికృష్ణకుమార్, సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ ఫయాజ్, జిల్లా మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓ, ఆర్ఐలకు నోటీసులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో నలుగురు ఉద్యోగులకు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. పన్నుల విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఆర్ఓ జి.శ్రీనివాస్, ఆర్ఐలు వజ్జా రామారావు, జ్యోతి, బిల్ కలెక్టర్ వీరబాబుకు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. తప్పుడు డాక్యుమెంట్లతో అసెస్‌మెంట్ నంబర్లు ఇవ్వడం, యజమానికి కాకుండా ఇతరుల పేరుతో పన్ను విధించడం, ఖాళీ స్థలానికి అసెస్‌మెంట్ నంబర్ కేటాయించినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయని తెలిసింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు కేఎంసీ అధికారులు విచారణ చేసి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

బస్సు, లారీ ఢీ : ఐదుగురికి గాయాలు



సత్తుపల్లి : క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు

సత్తుపల్లి: ప్రైవేట్ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో బస్సు డ్రైవర్‌తో పాటు నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి రాజమండ్రి వైపు 20 మంది ప్రయాణికులతో శుక్రవారం ఉదయం ప్రైవేట్ బస్సు వెళ్తోంది. ఈక్రమాన కిష్టారం ఓసీ సమీపంలో ఎదురుగా వచ్చిన లారీని ఢీకొనగా రాజమండ్రికి చెందిన ప్రయాణికులు రమేష్, అమ్మాజి, వినాయకుడు, సూర్యారావుకు స్వల్ప గాయాలయ్యాయి. అంతేకాక బస్సు డ్రైవర్ సోమరాజు క్యాబిన్‌లో ఇరుక్కుపోవటంతో ట్రెయినీ ఎస్సై అశోక్‌కుమార్, సిబ్బంది రవీంద్రనాథ్, నాగుల శ్రీనివాసరావు చేరకుని అతికష్టంగా ఆయనను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఉదయం 5–30గంటలకు జరగగా, ఉదయం 10 గంటల వరకు సత్తుపల్లి–ఖమ్మం రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. సత్తుపల్లి పోలీసులు సింగరేణి నుంచి క్రేన్లను రప్పించి బస్సు, లారీని విడదీసి పక్కకు పెట్టాక రాకపోకలను పునరుద్ధరించారు.

వైరా హైలెవల్ వంతెనపై...

వైరారూరల్: వైరా మండలం స్టేజీ పినపాక హైలెవల్ వంతెనపై శుక్రవారం ఆర్టీసీ బస్సు–లారీ ఢీకొన్నాయి. భద్రాచలం నుండి వస్తున్న డీలక్స్ బస్సు, వైరా నుండి తల్లాడ వైపు వెళ్తున్న లారీ వంతెనపై ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు. కాగా, ఈ ఘటనలో ప్రయాణికులకు గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి



మృతి చెందిన ఆవుల వద్ద రైతులు

రఘునాథపాలెం: మండలంలోని పుటాని తండాలో విద్యుదాఘాతంతో శుక్రవారం మూడు ఆవులు మృతి చెందాయి. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన వశ్య, శంకర్, గుగులోతు రాంజ్యాకు చెందిన ఆవులను మేతకు విడిచారు. ఓ రైతు పొలంలోని 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకున్న ఆవులు అక్కడే ఎర్త్ పైపును తాకడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో ఏఈ సతీష్, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవీలాల్, లైన్‌మెన్ ఎల్లయ్య చేరుకుని పరిశీలించగా, పశువైద్యాధికారి పోస్టుమార్టం చేశారు. ఈవిషయమై ఏడీ సంజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన పిడుగు పడడంతో ఎర్త్ దెబ్బతిని ఉంటుందన్నారు. తెల్లవారుజామున 4నుండి 8గంటల మధ్య విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో మరమ్మతులు చేశామని, ఆతర్వాత ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన చీకటి దీప్తి(28) గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఈ నెల 14న ఆమెను తల్లిదండ్రులు మందలించారనే మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయాన కలుపు మందు తాగింది. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు సత్తుపల్లికి, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొబ్బరి చెట్లపై పిడుగులు



పిడుగు పడటంతో కాలిన కొబ్బరిచెట్టు

చింతకాని/కామేపల్లి: చింతకాని మండలంలోని జగన్నాథపురంలోని ఆలస్యం వెంకయ్య ఇంట్లో ఉన్న కొబ్బరి చెట్టుపై శుక్రవారం తెల్లవారుజామున పిడుగు పడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడడంతో చెట్టుపై 20 నిమిషాల పాటు మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో వెంకయ్య ఇంట్లో అద్దెకు ఉంటున్న కోలేటి రాంచందర్‌రావు గృహంలోని ఎలక్ట్రానిక్స్ సామగ్రి, వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. అలాగే, కామేపల్లి మండలం తాళ్లగూడెంలోని బండారి రామయ్య ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపైనా పిడుగు పడింది. అయితే, అంతసేపు రామయ్య ఆరుబయటే నిద్రించగా, వర్షం వస్తుండడంతో లోపలకు వెళ్లాడు. అదే సమయాన పిడుగు పడడంతో ప్రమాదం తప్పినట్లయింది.

30ఏళ్లకు కలిసిన పూర్వవిద్యార్థులు



పాఠాలు చెప్పిన లెక్చరర్లతో పూర్వవిద్యార్థులు

రఘునాథపాలెం: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల 1993–96 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటపాలెంలో నిర్వహించారు. ఈసందర్భంగా ముప్పై ఏళ్లకు కలుసుకున్న స్నేహితులు ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ సందడిగా గడిపారు. అంతేకాక అప్పటి లెక్చరర్లు రామచంద్రరావు, విద్యాసాగర్, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ బ్యాచ్ విద్యార్థి, నటుడు ప్రభాకర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘానికి గది నిర్మాణం కోసం ముందుకొచ్చాడు.ఈకార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కామేపల్లి సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రంతో పాటు ఎం.వెంకట్, శేఖర్, సిరాజ్, కవిరాజు, వీరస్వామి పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



కాశమ్మ

చింతకాని/కొణిజర్ల: ఆస్పత్రికి బయలుదేరిన వృద్ధురాలు కానరాకుండా పోయిన ఘటన ఇది. చింతకాని మండలం కోమట్లగూడెంకు చెందిన బొగ్గుల కాశమ్మ(65) గురువారం ఉదయం ఆటోలో కొణిజర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి, అక్కడ వైద్యుడు లేకపోవడంతో బయటకు వచ్చింది. తొలుత ఆమె పెద్దగోపతి గ్రామీణ వికాస బ్యాంకులో రూ.5వేలు విత్‌డ్రా చేసినట్లు తెలియగా, ఆతర్వాత ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె కుమారుడు సీతారాంరెడ్డి శుక్రవారం కొణిజర్ల, చింతకాని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

చెరువులో విషం కలపడంతో చేపలు మృతి

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెం చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతో శుక్రవారం చేపలు మృతువాత పడ్డాయి. ఈ ఘటనలో దాదాపు రెండు టన్నుల మేర చేపలు చనిపోయి తేలిపోయాయి. ఈమేరకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు బోయిన వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన



పాలేరులో ధాన్యం బస్తాల కిందకు చేరిన వర్షపునీరు



మత్కేపల్లి క్రాస్ వద్ద తడిసిన ధాన్యం బస్తాలు

చింతకాని: చింతకాని మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడవగా రైతులు ఆందోళనకు గురయ్యారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యంపై పట్టాలు కప్పినా ఈదురుగాలులకు పట్టాలు ఎగిరిపోవడంతో ధాన్యం బస్తాలు తడిశాయి. కాంటా వేసి పది రోజులు దాటనా మిల్లులకు తరలించకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని రైతులు ఆరోపించారు.

కూసుమంచిలో...

కూసుమంచి: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు అప్రమత్తమయ్యేలోగా ధాన్యం తడవగా నష్టం ఎదురైంది. కాంటా వేసిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోగా, సకాలంలో మిల్లులకు తరలించకపోవటంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు.

తల్లాడ మండలంలో..

తల్లాడ: తల్లాడ మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలగా, వైర్లు తెగిపడ్డాయి. ఫలితంగా అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, కుర్నవల్లిల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అవస్థ పడ్డారు. కాగా, మండలంలోని అన్నారుగూడెం దళితకాలనీలో సైడ్ డ్రెయిన్లు లేక వరద నీరు నిలవడంతో రాకపోకలకు దీంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అన్నారుగూడెం ఎస్సీ కాలనీలో నిలిచిన నీరు

మూడు కేంద్రాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల మూడు కేంద్రాల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈనెల 13న మొదలై 17వ తేదీతో ముగియనున్న మొదటి విడత శిక్షణ హార్వెస్ట్ పాఠశాలలో ఏర్పాటుచేశారు. అయితే, ఉపాధ్యాయుల సంఖ్య దృష్ట్యా హార్వెస్ట్ పాఠశాలలో రెండు, మూడో విడత శిక్షణ ఇవ్వడమే కాక అదనంగా ఇంకో రెండు పాఠశాలలను కూడా గుర్తించినట్లు డీఈఓ సత్యనారాయణ తెలిపారు. మొదటి విడతలో హార్వెస్ట్ పాఠశాలలో సాంఘిక శాస్త్రం, గణితం, ఇంగ్లి ఉపాధ్యాయులు, ఆర్‌పీలకు శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ రెండు, మూడు విడతల్లో మిగతా సబ్జెక్టులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

కొత్తగా రెండు చోట్ల...

ఖమ్మంలోని న్యూ ఇరా హైస్కూల్‌లో ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు ఏన్కూరు, కల్లూరు, కామేపల్లి, వేంసూరు, చింతకాని, కొణిజర్ల, నేలకొండపల్లి, రఘునాథపాలెం, ముదిగొండ, ఖమ్మం అర్బన్ మండలాల గ్రేడ్–2 హెచ్‌ఎంలు, హైస్కూల్ స్థాయిలో తెలుగు, హిందీ ఉపాధ్యాయులు, సీఆర్‌టీలకు శిక్షణ ఇస్తారు. మూడో విడతగా 26నుంచి 30వ తేదీ వరకు తల్లాడ, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి, పెనుబల్లి, సింగరేణి, వైరా, ఎర్రుపాలెం, బోనకల్, ఖమ్మం రూరల్, ముదిగొండ మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అంతేకాక న్యూవిజన్ పాఠశాల(కోర్టు సమీపం)లో ఈనెల 20నుంచి 24వరకు ఏన్కూరు, కల్లూరు, కామేపల్లి, వేంసూరు, చింతకాని, కొణిజర్ల, నేలకొండపల్లి, రఘునాథపాలెం, ముదిగొండ, ఖమ్మం అర్బన్ మండలాల ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూళ్లలోని ఫిజికల్ సైన్స్, బయాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇస్తారు. ఇదే వేదికగా మూడో విడతలో తల్లాడ, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి, పెనుబల్లి, సింగరేణి, వైరా, ఎర్రుపాలెం, బోనకల్, ఖమ్మం రూరల్, మధిర మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు.

కాస్త శాంతించిన భానుడు

పలుచోట్ల వాన, చల్లబడిన వాతావరణం



ఖమ్మంవ్యవసాయం: జిల్లా వాతావరణంలో శుక్రవారం మార్పులు చోటు చేసుకున్నాయి. నైరుతి రుతుపవనాలు ఈనెల 27 నాటికి కేరళను తాకే అవకాశం ఉందని చెబుతుండగా.. అంతకు ముందుగానే వాతావరణంలో మార్పులతో జిల్లాలోని పలుచోట్ల గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షాలు కురిసాయి. ఈనెల రెండో వారం వరకు 40–45 డిగ్రీల మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు రెండు రోజులుగా 35–40 డిగ్రీలకు తగ్గాయి. శుక్రవారం గరిష్ఠంగా బాణాపురంలో 39.7 డిగ్రీలు, కనిష్ఠంగా గంగారంలో 35.5 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం రాత్రి 11గంటల నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ వాన శుక్రవారం ఉదయం వరకు కూడా పలు ప్రాంతాల్లో కొనసాగగా అత్యధికంగా మధిరలో 31.6 మి.మీ.లు, ఏన్కూరులో 28.6, వేంసూరులో 26.8, ఖమ్మం రూరల్‌లో 25.8, కూసుమంచిలో 22.6, తల్లాడలో 22.2, బోనకల్‌లో 16.4, సింగరేణిలో 13.8, కొణిజర్లలో 11.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు కురుస్తుండగా రైతులు భూమిలో తేమ ఆధారంగా అక్కడక్కడా దుక్కులు చేస్తున్నారు. అయితే యాసంగి పంటలకు మాత్రం నష్టం జరుగుతోంది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థ పడుతుండగా, కోత దశలో ఉన్న మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది.

చల్లబడిన వాతవరణం

వర్షాలు కురుస్తుండడం, ఉష్ణోగ్రతలు తగ్గడంతో జిల్లాలో వాతావరణం కొంత మేర చల్లబడింది. దాదాపుగా రెండు నెలలుగా ఉదయం 9గంటలకు మొదలవుతున్న ఎండ ప్రభావం ప్రభావం రాత్రి వరకు కొనసాగుతోంది. కానీ గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో చల్లబడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.





హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

''అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

> **అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.**

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలదు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్



● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

● వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.


● అజయ్, రోషిణి

కుమారుడితో కలిసి దిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలిసారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షనల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.

స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...



అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది..

మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...

''లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరపు, అమ్మ తరపు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెయిన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్ల కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకువెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సుడాన్.

> **మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.**

అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే. ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే... అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే! పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో... ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్. అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు... విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది. అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

సగ్గుబియ్యం అప్పడాలు



కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.